క్లుప్తంగా

ఘనంగా పద్మనాభుడి కల్యాణం



స్వామి వారి కల్యాణోత్సవం

అనంతగిరి: అనంత పద్మనాభ స్వామి ఆలయ కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి రథోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవం సందర్భంగా ఉదయాన్నే దేవాలయానికి చేరుకున్న భక్తులు పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం 7 గంటలకు వేదమంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం జరిగింది. ఉత్సవం అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

'విజయభేరి'కి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సభకు తరలిన నాయకులు

పూడూరు: కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయభేరి సభకు మండల పరిధి నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ మాట్లాడారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, అజీంపటేల్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అనంతగిరి: మహిళపై దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు అయింది. ఈ సంఘటన సోమవారం వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంద్రానగర్‌కు చెందిన ఒక యువకున్ని నవీన్ అనే వ్యక్తి దూషించాడు. ఈ విషయమై సదరు యువకుడి తల్లి జయమ్మ నవీన్‌ను ప్రశ్నించింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నవీన్ విచక్షణ కోల్పోయి.. ఖాళీ మద్యం సీసాను పగులగొట్టి ఆమెపై దాడి చేసి గాయపర్చాడు. గాయపడిన జయమ్మను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత



మద్యం సీసాలతో ఎక్సైజ్ పోలీసులు

అనంతగిరి: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈఎస్ నవీన్‌చంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక సోదాలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఆలంపల్లి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనం పట్టుబడింది. ఇందులో 49.8లీటర్ల మద్యం ఉండగా.. వాటిలో 180 మిల్లీ లీటర్ల సీసాలు గల నాలుగు కాటన్ల రాయల్ స్టాగ్ విస్కీ, కింగ్ ఫిషర్ బీర్లు 24 సీసాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. సోదాల్లో ఇన్‌స్పెక్టర్ ధన్వంత్ రెడ్డి, ఎస్ఐ కోటేశ్వరగౌడ్, సిబ్బంది శివ, రవికిరణ్ పాల్గొన్నారు.

అధికార పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో నాయకులు

వికారాబాద్ అర్బన్: బీఆర్ఎస్‌కు ఓటు వేసి, సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసుకోవాలని ఆ పార్టీ యువజన విభాగం నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మర్పల్లి మండలం కుడుగుంట గ్రామానికి చెందిన 30 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్యల ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. వారికి చంద్రశేఖర్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బీఎస్పీకి ప్రజల మద్దతు

తాండూరు: తాండూరులో బీఎస్పీకి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని ఆ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని చెప్పారు. బీఎస్పీతోనే సాధికారత వస్తుందన్నారు. కావున అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఇందులో బీఎస్పీ అసెంబ్లీ కన్వీనర్ సత్యమూర్తి ఉన్నారు.

కోతలు సరే.. కొనుగోళ్లేవి?

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- పొలాలు, రోడ్లపైనే ధాన్యపు రాశులు
- దిగుబడిని కాపాడుకోలేక.. దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- ఎన్నికల విధుల్లో అధికారులు బిజీబిజీ!



పొలాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు

సాగు చేయడం ఒకెత్తైతే.. చేతికొచ్చిన ధాన్యాన్ని విక్రయించుకోవటం రెట్టింపు కష్టంగా మారింది. ఎంకిపెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు సాధారణ ఎన్నికలు కర్షకులకు కష్టాలు తెచ్చిపెట్టాయి. వరి కోతలు షురూ అయి మూడు వారాలు అయినా.. విక్రయ కేంద్రాలు తెరిచేందుకు అధికారులు దిక్కులేరు. దీంతో దిక్కులు చూడటం రైతన్నల వంతు అయింది. చేసేదిలేక వచ్చిన ధరకు దిగుబడిని దళారులకు తెగనమ్ముతున్నారు.

దోమ: చెమటోడ్చి పండించిన తిండిగింజలను విక్రయించే దారిలేక.. కాపాడుకోలేక కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. కోతల అనంతరం వచ్చిన దిగుబడిని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో.. రోడ్లపై, పొలాల వద్ద రాశులుగా పోసి, రేయింబవళ్లు కాపాలా కాస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు కేంద్రాల ప్రారంభానికి మొగ్గుచూపటం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో కొనుగోలు కేంద్రాలు 16 ఉన్నా.. అందులో ఏవి కూడా తెరవలేదు. ఒకే ఒక్కటి మండల కేంద్రం డీసీఎమ్మెఎస్ ఆధ్వర్యంలో మొక్కుబడిగా ప్రారంభించినా.. ప్రక్రియ మొదలు కాలేదని తెలుస్తోంది. ఐనాపూర్, బొంపల్లి, బ్రహ్మణపల్లి, దిర్సంపల్లి, గుండాల, కిష్టాపూర్, కొండాయపల్లి, మోత్కూర్, ఊటుపల్లిలో పీఏసీఎస్, పాలేపల్లి, బడేంపల్లి గ్రామాల్లో ఐకేపీ, ఖమ్మం నాచారం, దాదాపూర్, రాకొండ, శివారెడ్డిపల్లి గ్రామాల్లో డీసీఎమ్మెఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఉన్నా.. ఎన్నికల విధుల్లో అధికారులు ఉండటంతో వాటిని వినియోగంలోకి తేవడం లేదన్నట్లు తెలుస్తోంది.

దళారులే దిక్కు..

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వినియోగంలోకి రాక పోవడంతో రైతులకు దళారులే దిక్కవుతున్నారు. పంట చేతికి వచ్చి 25 రోజులు గడుస్తున్నా.. ధాన్యం ఆరబెట్టుకునేందుకు అనువైన స్థలం, టార్పాలిన్లు లేవు. చేసేది లేక చివరకు వచ్చిన ధరకు దళారులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తరుగు, తాలు పేరుతో దగా



సీజన్ ప్రారంభం అయినప్పటికీ అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ లేదు. తప్పని పరిస్థితుల్లో ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నాం. వారు ఇష్టానుసారంగా తరుగు, తాలు, కమీషన్ల పేరుతో దగా చేస్తున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

– పవన్ ముదిరాజ్, రైతు, బాస్‌పల్లి

స్థలాలు కేటాయించాలి



కొనుగోలు కేంద్రాలు లేక, ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. యేటా ఇదే పరిస్థితి ఉంటోంది. ప్రస్తుతం విక్రయ కేంద్రాలు తెరవక పోవడంతో వడ్ల గింజలను రోడ్లపై, పొలాల దగ్గర ఆరబోస్తున్నారు. అధికారులు త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలాలను కేటాయించాలి.

– జాకటి వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్, దోమ

ఈసీ నిబంధనల మేరకే



కొనుగోలు కేంద్రాల ప్రారంభ విషయంలో ఆలస్యం జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ అనంతరం కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందవద్దు.

–ప్రభాకర్ రావు, మండల వ్యవసాయ అధికారి

ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేటి సాయంత్రం 5 గంటలకు ప్రచారం బంద్
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసరావు



తాండూరు టౌన్: సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

తాండూరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో తాండూరు ఎన్నికల సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జరగనున్న పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. 29న పట్టణంలోని సెయింట్ మార్క్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విస్తరణ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలతో పాటు, తదితర సామగ్రిని అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందిని గ్రామాలకు తరలించాలని సూచించారు. మంగళవారం సాయంత్రం 5గంటల వరకే రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం ముగించాలని, ఆ తర్వాత ప్రచారం చేసినట్లు తెలిస్తే.. అభ్యర్థులపై ఈసీ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రజలు సివిజిల్ యాప్‌ను ఉపయోగించి, సమస్యలు ఏమైనా ఉంటే ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోనే సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.

కేంద్రాలకు సీసీ కెమెరాలు, ట్రైసైకిళ్లు

పెద్దేముల్: ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు సీసీ కెమెరాలతో పాటు, వృద్ధుల కోసం ట్రైసైకిళ్లు వచ్చేశాయి. మండలానికి 32 ట్రై సైకిళ్లు వచ్చాయని సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది. 29 వరకు అన్ని కేంద్రాలకు సైకిళ్ల పంపిణీతో పాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు అవుతాయని పేర్కొన్నారు.

హస్తాన్ని నమ్మితే ప్రజలు ఆగమే



ఇంటింటి ప్రచారంలో ఎంపీటీసీ తదితరులు

దోమ: ఇంటింటికీ ఆరు గ్యారంటీలతో వస్తున్న కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే ప్రజలు ఆగమవుతారని ఎంపీటీసీ రాములు అన్నారు. సోమవారం దోమ మండలం బొంపల్లి, బాస్‌పల్లి, బొంపల్లితండాల్లో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. కావున ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బొంపల్లి ఉప సర్పంచ్ రఫీక్ పాషా, పార్టీ నాయకులు షేర్‌ఖాన్, షఫీ, ప్రవీణ్‌యాదవ్, సంఘయ్య, ప్రశాంత్ యాదవ్, సాయప్ప పాల్గొన్నారు.

దోపిడీ ప్రభుత్వాలను తరిమికొట్టండి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను దోపిడీ చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ఆరోపించారు. సోమవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన సీపీఎం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ పేదలకు చేసిందేమీ లేదన్నారు. సీపీఎం నేటికీ ప్రజాసంక్షేమం కోసం పోరాడుతూనే ఉందని తెలిపారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు రాజకీయ నాయకులే దోచుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజలకు ఆశ చూపి నిరాశ పరిచారని దుయ్యబట్టారు. మళ్లీ మోసగించేందుకు బీఆర్ఎస్ నాయకులు వస్తున్నారని, వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్తయ్య, హబీబ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: పట్టణంలో ప్రచారం చేస్తున్న బీసీ సంఘం సభ్యులు



ఈవీఎం నమూనాతో ఓటుపై అవగాహన కల్పిస్తున్న వైస్ చైర్‌పర్సన్ దీప

ఆనంద్‌ను ఆదరించండి..



మోమిన్‌పేట: ఇంటింటి ప్రచారం చేస్తున్న సబితాఆనంద్

మోమిన్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ భార్య సబిత అన్నారు. సోమవారం ఆమె మండల పరిధి మేకవనంపల్లి, మేకవనంపల్లి తండాలో సర్పంచ్ శశిధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని, అభివృద్ధిలో దేశంలోని రాష్ట్రాల కంటే ముందు వరుసలో ఉందని సబిత పేర్కొన్నారు. నిత్యం ప్రజా సంక్షేమ కోసం పాటుపడే బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరించాలని ఆమె కోరారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి, నిత్యం మీతోనే ఉండే నా భర్త ఆనంద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్‌దే అధికారం

బంట్వారం: తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్‌పై అపారమైన విశ్వాసం ఉందని, రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారమని భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య ధీమా వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగరనుందని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

హ్యాట్రిక్ విజయం ఖాయం

- ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆశీర్వదించండి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

తాండూరు టౌన్: ప్రత్యేక తెలంగాణలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి పట్టణంలో ముమ్మర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదేళ్లుగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన తెలంగాణ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టనున్నారని చెప్పారు. రూ. వందల కోట్ల నిధులతో తాండూరు నియోజకవర్గాన్ని పైలెట్ రోహిత్‌రెడ్డి సుందరంగా తీర్చిదిద్దారని తెలిపారు. అలాంటి వ్యక్తిని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా.. మున్సిపాలిటీ పరిధి 10వ వార్డులో వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈవీఎం నమూనాతో ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి

యాలాల: బీఆర్ఎస్‌తోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, బషీర్‌మియాతండా సర్పంచ్ మిత్రు నాయక్ అన్నారు. ఈ నెల 9 నుంచి రోహిత్ రెడ్డి గెలుపుకోరుతూ మిత్రునాయక్ ఒంటిపై షర్టు, కాళ్లకు చెప్పులు ధరించనని ప్రతిజ్ఞ చేసిన విషయం విధితమే. ఇందులో భాగంగా ఆయన పలు పుణ్య క్షేత్రాలకు వెళ్లారు. దైవ దర్శనం అనంతరం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి రోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయన గెలుపు అనంతరం తాండూరు నుంచి తిరుపతికి పాదయాత్రగా వెళ్లనున్నట్లు నాయక్ పేర్కొన్నారు.

నా భర్తను ఆశీర్వదించండి



ఇంటింటి ప్రచారంలో చిన్నారితో ఆర్తీరెడ్డి

బషీరాబాద్: తన భర్త పైలెట్‌ను మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని రోహిత్‌రెడ్డి భార్య ఆర్తీరెడ్డి ఓటర్లను కోరారు. బషీరాబాద్ మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. రెండేళ్ల కాలంలోనే తాండూరు అభివృద్ధికి రూ.1,680 కోట్ల నిధులను రాబట్టి, అభివృద్ధి చేశారని చెప్పారు. ఇలా అభివృద్ధికి పాటుపడిన రోహిత్‌ను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు జయమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతో సకల జనులకు మేలు

- పక్కాగా ఆరు పథకాలు అమలు
- కబ్జాకోరు బీఆర్ఎస్‌ను సాగనంపండి
- ఇంటింటి ప్రచారంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ



ప్రచారం చేస్తున్న లాల్‌కృష్ణ తదితరులు

పరిగి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని, అప్పుడే సకల జనులకు మేలు చేకూరనుందని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధి పలు గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలను వివరించారు. అనంతరం మాట్లాడారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్‌ను ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ధరణి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు సైతం భూకబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. కబ్జాకోరు ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ విఫలమయ్యారని, మేనిఫెస్టోలో లేని హామీలను గుప్పిస్తూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. అధికారం చేపట్టగానే అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందజేస్తామని, మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తామని చెప్పారు. కావున అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వం

కుల్కచర్ల: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం కోస్గి పట్టణంలో జరిగిన ప్రియాంక గాంధీ సభకు కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, వెంకటయ్య, స్వామి, మహేష్, సోమలింగం, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



కుల్కచర్ల: లింగరూపంలో దీపాలను అలంకరించిన భక్తులు, అర్చకులు



కుల్కచర్లలో..



కొడంగల్ రూరల్: మహాదేవుని ఆలయంలో

ఆలయాల్లో కార్తీక శోభ

కార్తీకమాస పౌర్ణమిని పురస్కరించుకుని దేవాలయాలు భక్తుజనంతో కిటకిటలాడాయి. కుల్కచర్ల పాంబండ రామలింగేశ్వర, తాండూరు శివభక్త మార్కండేయస్వామి, కొడంగల్ శ్రీమహాదేవుని ఆలయాల ప్రాంగణాల్లో సోమవారం రాత్రి మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించి, పూజలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్

అవినీతి పాలనకు చరమగీతం



యాలాల: పార్టీలో చేరిన వారితో తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి

- కాంగ్రెస్ వస్తే అందరికీ మేలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

యాలాల: అధికార బీఆర్ఎస్ పాలన నచ్చకే.. ఆ పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, యువ నాయకుడు కిరణ్‌రావు దేశ్‌ముఖ్ కాంగ్రెస్‌లో చేరగా.. ఆయనకు బుయ్యని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడారు. అవినీతి పాలనకు చరమగీతం పాడి, కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వస్తే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. అంతే కాకుండా పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, దేవనూరు మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, నాయకులు హన్మంతు, మహిపాల్, హన్మ్యానాయక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేశారు. మండల పరిధి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల గురించి వివరించారు. కాంగ్రెస్ వస్తే అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని, అర్హులందరికీ గ్యారంటీలు అందుతాయని చెప్పారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు.

వారికి ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే..

కుల్కచర్ల: సంక్షేమపాలన అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలుద్దామని రాష్ట్ర విద్యావనరుల మౌలిక వసతుల కమిటీ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం కుల్కచర్ల మండలం కుస్మసముద్రం గ్రామంలో స్థానిక నేతలు మాజీ ఎంపీపీ అరుణరాజప్ప ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. సుదీర్ఘ పోరాటంతో సాధించుకున్న తెలంగాణను మళ్లీ కాంగ్రెస్ నేతల చేతుల్లో పెడితే కష్టాలు కోరి తెచ్చుకున్నట్లేనని పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. నాయకులు ప్రసన్న, లాలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.